ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 27 ఆగస్టు 2025



పీలేరు బీవీ రెడ్డి కాలనీ సెంటర్‌లో కొలువుదీరిన గంధంతో తయారైన నాట్య వినాయకుడు

సందడే.. సందడి...

- ఇళ్లల్లో మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం
- కొండెక్కిన పూలు, పండ్ల ధరలు
- రహదారులు రద్దీ.. ట్రాఫిక్ మళ్లింపు
- మండపాలకు తరలిన గణనాథులు
- నేడు వినాయకచవితి

వినాయక చవితి పండుగ సందర్భంగా ఊరువాడా అంతా ఎక్కడ చూసినా ఒకటే సందడి.. గణనాథులను ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు పిల్లల నుంచి పెద్దల వరకు అంతా ఉత్సాహంగా మండపాలను సిద్ధం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వినాయక విగ్రహాలను 3 నుంచి 11 రోజుల పాటు పూజించి నిమజ్జనం చేస్తారు. ఎంతో ఆర్భాటంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే జిల్లాలోని పలుచోట్ల పలువురు స్వచ్ఛందంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



పీలేరులోని పూలు, పత్రి అంగళ్ల వద్ద రద్దీ



మదనపల్లెలోని బెంగళూరు బస్టాండు వద్ద పండుగ వాతావరణం

మదనపల్లె/పీలేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ చూసినా వినాయక చవితి సందడి నెలకొంది. పట్టణమే కాదు.. ప్రతి పల్లెలోనూ పండుగ సందడి నెలకొంది. వీధి వీధినా, వాడవాడలా వినాయకుడి మండపాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. బుధవారం పండుగ నేపథ్యంలో మంగళవారమే మదనపల్లె పట్టణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఇళ్లల్లో ప్రతిష్ఠించి పూజలు చేసే వినాయకుడిని ఎక్కువగా మట్టి విగ్రహాలను కొనుగోలు చేయడం కనిపించింది. వీధుల్లో ఏర్పాటు చేసే పెద్ద విగ్రహాలు మాత్రం పీవోపీతో చేసినవే వాడుతున్నారు. కాగా మదనపల్లె పట్టణంలో మంగళవారం సంత కావడంతో ప్రధాన రహదారులు, కమర్షియల్ ఏరియాలు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్లపై పండుగ సామగ్రి విక్రయించే తోపుడు బండ్ల నుంచి దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు పట్టణంలోకి ప్రవేశించే వాహనాలు, బయటి నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలను దారి మళ్లించి, వీలైనంత వరకు ప్రజలు, కొనుగోలు దారులు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ పండుగ సందడి దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా సీటీఎం రోడ్డు, బెంగళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు, ఆర్.ఆర్‌వీధి, నెహ్రూ వీధి, నీరుగట్టువారిపల్లె, ఎన్టీఆర్ సర్కిల్, తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి. అలాగే వినాయకుడి ప్రతిమల విక్రయ కేంద్రాలు, వస్త్రదుకాణాలు, స్వీట్ దుకాణాలు, తదితర హోల్‌సేల్ దుకాణాలు కస్టమర్లతో కళకళలాడాయి.

వినాయకుని పండుగకు వినియోగించే పూలు, పండ్లు, ఇతర పూజాసామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. పండుగకు కావాల్సిన పూజా సామగ్రి, ఇతర వస్తువులను మహిళలు కుటుంబసభ్యులతో వచ్చి కొనుగోలు చేశారు. టౌన్ బ్యాంకు సర్కిల్ నుంచి అవెన్యూ రోడ్డు, బెంగళూరు బస్టాండు, పటేల్ రోడ్డు వరకు, చిత్తూరు బస్టాండు నుంచి నెహ్రూ బజార్ వరకు వ్యాపారులు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. అరటిబోదెలు, తోరణాలకు మామిడి ఆకులు, పూజలో పెట్టే తామరపూలు, జిల్లెడు పూలహారాలు, ఎలక్కాయలు, టెంకాయలు, పూలు, పండ్లు, తదితర పూజా సామగ్రి కొనగోలు కేంద్రాలు రద్దీగానే కాదు..సందడిగా మారాయి.

బంతిపూలు కిలో రూ.200, వివిధ రంగుల బటన్ రోజాలు రూ.300, చామంతి పూలు రూ.300, మల్లెపూలు కిలో రూ.1,000, కనకాంబరాలు రూ.2,500, వివిధ రకాల బటెన్ రోజాలు రూ.200 ధర పలికాయి. మరోవైపు పూలహారాలు...సైజు, డిజైన్, పూల రకాన్ని బట్టి రూ.200 నుంచి రూ.10 వేల వరకు పలికాయి. అలాగే కొబ్బరికాయ ఒకటి రూ.30 నుంచి రూ.50 వరకు ధర ఉంది. పండ్లు..అరటి పండ్లు డజను రూ.50-70, జామ, బేరి కాయలు కిలో రూ.100, దానిమ్మ కిలో రూ.150 పోయాయి. ఇళ్లలో ప్రతిష్ఠించి పూజించే చిన్నపాటి వినాయకుని ప్రతిమలు ఒక్కొక్కటి మట్టివి రూ.200, రూ.1,000 వరకూ అందుబాటులో ఉండగా, మండపాల్లో ప్రతిష్ఠించే వినాయకుని విగ్రహాలు కనిష్ఠంగా రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకూ ధర పలుకుతున్నాయి. ఇందులో విగ్రహం ఎత్తు, వెడల్పు, డిజైన్, దేవతల రకాన్ని బట్టి ధరలు మారుతున్నాయి. విగ్రహాలను కొనుగోలు చేసిన నిర్వాహకులు.. ఊరేగింపుగా మండపాలకు చేరుస్తున్నారు.



ప్రత్యేక ఆకర్షణగా వినాయకుడి గొడుగులు

మండపాలకు తరలిన గణనాథులు

వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు పీలేరు నియోజకవర్గ ప్రజలు తమ బడ్జెట్‌కు అనుగుణంగా వివిధ సైజుల విగ్రహాలను కొనుగోలు చేసి ఇప్పటికే తమ గ్రామాలకు చేర్చుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి విగ్రహాల గోడౌన్‌లు ఉన్న చిత్తూరు, కడప, తిరుపతి మార్గం, ఏఎంసీ ప్రాంగణం కిటకిటలాడాయి. సైజులను బట్టి ఒక్కో విగ్రహం కనిష్ఠంగా రూ.12 వేల నుంచి గరిష్ఠంగా రూ.1.50 లక్షలు పలికాయి. తమకు నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేసిన తరువాత తమ సెంటర్లకు తరలించే క్రమంలో యువత కేరింతలు, బాణాసంచా పేలుళ్లతో దద్దరిలిపోయిన పీలేరు పట్టణం సాయంత్రం నుంచి పూజాసామాగ్రి కొనుగోలు కోసం ఇళ్లలో నుంచి బయటకు వచ్చిన ప్రజలతో నిండిపోయింది.

పీలేరు ప్రత్యేకం...

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాదు తరువాత వినాయక చవితికి అధిక కేంద్రాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడం, నిమజ్జనాన్ని ర్యాలీగా ఒకేరోజు నిర్వహించడం పీలేరు ప్రత్యేకత. కులమతాలకతీతంగా పీలేరు మండల వ్యాప్తంగా చిన్నా, పెద్ద తేడా లేకుండా అత్యధిక సెంటర్లలో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించడం ఆనవాయితీ. అలా ఈ ఏడాది పీలేరు పట్టణంలో 82, మండలంలోని అన్ని ప్రాంతాల్లో 100 కేంద్రాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. శుక్రవారం రోజున స్వామి వారిని నిమజ్జనం చేయడం మంచిది కాదన్న భావనతో పీలేరు మండలంలో నిమజ్జనాన్ని ఆదివారం జరపనున్నారు.





పూల అంగళ్ల వద్ద...





మదనపల్లెలోని చిత్తూరు బస్టాండులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

నకిలీ బంగారంతో టోకరా

- రూ.3.76 లక్షలతో ఉడాయించిన జంట



బంగారంలానే వున్న నకిలీ బ్రాస్‌లెట్



బ్రాస్‌లెట్‌ను కుదువ పెట్టిన మహిళ



బ్రాస్‌లెట్‌ను అమ్మిన వ్యక్తి

రైల్వేకోడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రెండు బంగారు దుకాణాల్లో నకిలీ బంగారాన్ని అమ్మి రూ.3.76 లక్షలతో ఓ జంట ఉడాయించిన సంఘటన రైల్వేకోడూరులో మంగళవారం వెలుగుచూసింది. పట్టణంలోని ప్రధాన దారిలో ఉన్న ఓ బంగారు దుకాణానికి ఓ మహిళ బ్రాస్‌లెట్ తీసుకెళ్లి దుకాణదారుడికి ఇచ్చి కుదువ పెట్టుకుని డబ్బులు కావాలని అడిగింది. దీంతో దుకాణదారుడు బ్రాస్‌లెట్ (24 గ్రాములు) కు వెనుక భాగంలో 916 నెంబరును పరిశీలించి నిర్ధారణకు వచ్చి మహిళకు రూ.1.16 లక్షలు నగదు ఇచ్చి కుదువ పెట్టుకున్నాడు. అదే విధంగా ఓ వ్యక్తి మార్కెట్ వీధిలో ఉన్న ఓ బంగారు దుకాణానికి వెళ్లి బ్రాస్‌లెట్ అమ్ముతానని తెలిపాడు. దానిని పరిశీలించిన దుకాణం యజమాని రూ.2.16 లక్షల నగదు ఇచ్చాడు. ఇరువురు తిరుపతి అడ్రస్ ఇచ్చారని బాధితులు తెలిపారు. ఆ రెండు బ్రాస్‌లెట్లు బంగారం కాదని తేలింది. బంగారం వ్యాపారం చేసే వారే మోసపోయారంటే మామూలు వ్యక్తులు ఇంకెంత మోసపోతారని మార్కెట్ వీధిలో అందరూ అనుకుంటున్నారు. బంగారం నకిలీ అని తెలుసుకున్న దుకాణ యజమానులు మోసం చేసిన జంటను పట్టుకోవడానికి అడ్రస్ వెతుక్కుంటూ తిరుపతికి వెళ్లారు. అయితే వారు ఇచ్చిన అడ్రస్ తప్పుగా ఉందని తెలుసుకున్నారు. ఏమీ చేయలేక తిరుగుముఖం పట్టారు. వేర్వేరుగా బ్రాస్‌లెట్లను తీసుకుని వచ్చిన ఇరువురు భార్యాభర్తలని చెప్పుకుంటున్నారు. ఒక బాధితుడు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఎస్ఐ ఎల్‌వీ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో విచారిస్తామని తెలిపారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

- పర్యావరణ పరిరక్షణకు చేయూతనిద్దాం
- మట్టి విగ్రహాల పంపిణీలో కలెక్టర్ చామకూరి శ్రీధర్



చిన్నారులకు మట్టి విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు చేయూతనిద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, రాయచోటి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాయచోటి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద అధికారులతో కలిసి 1500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను వాడి నీటిని కాలుష్యం చేయరాదన్నారు. జీవరాశుల మనుగడ ముఖ్యమని, వాటి సంరక్షణ మనందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ సుధా, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, మున్సిపల్ కమిషనర్ రవి, ఏఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, అనాలసిస్ట్ సునీల్‌కుమార్, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే లైసెన్స్‌ల రద్దు

- జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

గుర్రంకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులను అమ్మితే వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ హెచ్చరించారు. మండలంలోని నడిమిఖండ్రిగ, తరిగొండ, గుర్రంకొండలో ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ, తరిగొండలో కొందరు వ్యాపారులు నకిలీ ఎరువులను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. రైతులకు నకిలీ ఎరువులను అమ్మినట్లు తెలిస్తే ఆ వ్యాపారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వ్యాపారి నాణ్యమైన ఎరువులను స్టాక్ ఉంచి విక్రయించాలన్నారు. అనంతరం నడిమిఖండ్రిక గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గుర్రంకొండలో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం తరిగొండ రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ నాగప్రసాద్, ఏవో రత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ శ్రీనివాస MPHW (F) ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్
ఆర్.వి.ఎస్.నగర్, తిరుపతిరోడ్డు, చిత్తూరు
ANM / MPHW Training కోర్సుకు సువర్ణవకాశం
కాలపరిమితి 2 సంవత్సరములు మాత్రమే
అర్హులు : ఇంటర్మీడియట్ ఏదైనా గ్రూపు నందు పాస్ అయిన వారు మరియు / APOSS / ఇంటర్ ఒకేషనల్ (10+2) పాస్‌అయిన వారు ఎస్సీ/ఎస్టీ/బీసీ మరియు మైనార్టీ విద్యార్థినులు
వయస్సు : 17 సంవత్సరముల నుండి 35 సంవత్సరముల వరకు
గమనిక : అర్హులైన విద్యార్థినులు టెన్త్ మరియు ఇంటర్ పాసైన సర్టిఫికెట్లు మరియు బయోడేటా పై అడ్రస్‌కు పోస్ట్ ద్వారా పంపగలరు.
హాస్టల్ వసతి కల్పించబడును
పూర్తి వివరాలకు ఈ సెల్ నెంబరును సంప్రదించండి - 8309836927

ఎన్నేళ్లలో పూర్తి చేస్తారు?

- ఆర్వోబీ సంస్థ సిబ్బందిపై ఆర్డీవో శ్రీనివాస్ అసహనం
- బ్లాక్ లిస్టు అయ్యే అవకాశం ఉందంటూ హెచ్చరిక



ఆర్వోబీ కాంట్రాక్టు సంస్థ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్


పీలేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్వోబీల పనులను సాగదీస్తున్నారు. పనులు జరగాల్సినంత వేగంగా జరగడం లేదు. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు మూడేళ్లు కావస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇంత నిదానంగా పనిచేస్తే ఎలా? ప్రజల ఇబ్బందులు మీకు కనిపించడం లేదా? పనుల్లో వేగం పెరగాలి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలి. మీ సంస్థ పనితీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని ప్రభుత్వం భావిస్తోంది. మీ పనితీరు మారకుంటే మీ సంస్థ బ్లాక్‌లిస్టు అయ్యే అవకాశం ఉంది. ఆ తరువాత మీ ఇష్టం అంటూ స్థానిక ఆర్వోబీ నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థపై రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ అసహనం వ్యక్తం చేశారు. ఆర్వోబీ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పనులు మందకొడిగా సాగడం, కూలీలు చాలా తక్కువగా ఉండడం గమనించిన ఆయన కాంట్రాక్టు సంస్థ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఎప్పటికప్పుడు సహకరిస్తున్నా పనులు సాగడం లేదన్నారు. మరో ఆరు నెలల్లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన పీలేరు ఎల్‌బీఎస్ రోడ్డులోని 8వ చౌకదుకాణాన్ని తనిఖీ చేశారు. చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్ పనులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ ఈఈ శ్రీనివాస్, తహసీల్దారు శివకుమార్, సీఎస్ డీటీ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అనుకున్నదే...అయింది

- కొన్ని బార్లకు బోణీ కాలేదు
- ఏఈఆర్‌టీ ఎఫెక్ట్..
- మూడు బార్లకే దరఖాస్తులు

6



మట్టి గణపతే.. మహాగణపతి...

- మట్టి విగ్రహాలనే పూజిద్దాం
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో అనేక అనర్థాలు



గాలివీడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా మట్టి ప్రతిమలనే పూజించాలని పలువురు పెద్దలు అంటున్నారు. కానీ ఎన్నో ఆకృతుల్లో హానికరమైన రసాయన రంగులతో వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత, ప్రజలు వాటికి ఆకర్షితులవుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాల కోసం నేడు వాటినే మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మట్టి వినాయకులనే పూజించేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత ఈ దిశగా ఆలోచన చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ముప్పు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి త్వరగా కరగవు. ఈ ప్రతిమల్లో జిప్సం, గంధకం, మెగ్నీషియం పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి. వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిపిన నీటి వల్ల చర్మవ్యాధులు వస్తాయి.



మట్టి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నీటిలో కరగడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. రసాయన రంగులు కలిపిన నీరు పంట పొలాలకు అందించడం ద్వారా దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

జంతుజాలానికి ముప్పు



వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమను పూజించడం అన్ని విధాలా శ్రేయస్కరం. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలతో మానవాళికి కాదు జంతు జలానికి ఎంతో ముప్పు. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలను కాకుండా మట్టి వినాయక ప్రతిమలనే మండపాల్లో ప్రతిష్ఠించుకోవాలి.

- డాక్టర్ రామచంద్రారెడ్డి, గాలివీడు

అవగాహన కల్పిస్తున్నాం



మట్టి వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేసుకోవాలని ఎన్నో ఏళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం. మా సంస్థ ద్వారా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశాం.

- అర్యశంకర్, సేవాభావం సంస్థ వ్యవస్థాపకుడు

మట్టి వినాయకులనే ప్రతిష్ఠిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా యువతను ప్రోత్సాహించాలి. రకరకాల రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ వాటి వల్ల చాలా ముప్పు ఉంటుంది. మట్టి ప్రతిమలతో ఉత్సవాలను చేసుకుందాం.

- ఉదయ్‌కుమార్, గుండ్లచెరువు

గంజాయి మొక్కలు తొలగింపు



గంజాయి మొక్కల పెంపకంపై విచారణ చేస్తున్న సీఐ వరప్రసాద్

సుండుపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలు పెంచుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలు తొలగించినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురం బిడికికి చెందిన మూడే సుబ్బరాంనాయక్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న సమాచారం వచ్చిందన్నారు. రాయచోటి ఎక్సైజ్, రెవెన్యూ అధికారులతో వెళ్లి మూడే సుబ్బరాంనాయక్ ఇంటి పరిసరాల్లో పెంచుకుంటున్న సుమారు 10 గంజాయి మొక్కలను తొలగించి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి మొక్కలు పెంచడం, సరఫరా చేయడం, గంజాయి వినియోగం చట్టరీత్యా నేరమని, అలా ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వద్దు

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివనారాయణ

నిమ్మనపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయపరపతి కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రైతులకు అందించే ఎరువుల కొరత లేదని అయితే రైతులు నానో యూరియా, డీఏపీలను వాడితే వరి పంటతో పాటు ఇతర పంటలకు పిచికారీ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన నిపుణులు ఉన్నారని తెలిపారు.

నానో ఎరువు బాటిల్‌లో లిక్విడ్ రూపంలో వస్తుందని ఇది పిచికారీ చేస్తే యూరియా కంటే ఎక్కువగా పనిచేసి అధిక పంటలు పండుతాయని తెలిపారు. నానో లిక్విడ్‌ను పంటలకు పిచికారీ చేసేందుకు ఎకరాకు కేవలం రూ. 300 మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపడితే ఎరువులతో పని వుండదని తెలిపారు. ప్రసుత్తం ప్రైవేటు ఏజన్సీలకు 30 శాతం ప్రభుత్వానికి 70 శాతం ఎరువులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఎరువుల దుకాణ దారుల అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రరమేష్, ఏఓ మంజుల, సీఈవో హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


చిట్వేలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ టీమ్ మురళీకృష్ణ (ఫారెస్ట్ రేంజ్ అధికారి) ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులను, స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్స్‌ను, గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు అమ్మినా, నాణ్యతలేని, అనుమతులు లేని ఎరువులను అమ్మినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో అన్ని రికార్డులను, బిల్‌బుక్స్‌ను నిర్వహించాలని ఆదేశించారు. మన గ్రోమోర్, లక్ష్మీశ్రీనివాస, పరస్పర సహకార సంఘం, వెంకటసాయి ఆగ్రో ట్రేడర్స్ దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, విజిలెన్స్ కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

తంబళ్లపల్లె ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పెండూరివారిపల్లె వాసి పి.చంద్రశేఖర్ సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామచంద్రారెడ్డిపై దాడికి దిగాడు. బాధితుడి ఫిర్యాదుపై చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

ఆదర్శ పాఠశాల విద్యార్థిని



మధులత

పుల్లంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మధులత రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తెలిపారు. పులివెందులలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సిబ్బంది మధులత, పీడీ నీలకంఠరావులు విద్యార్థినిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



విజయ్ (ఫైల్‌ఫొటో)

చిన్నమండెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై కస్తూర్బా స్కూల్ ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని కంచపు విజయ్ (20) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకెళ్తే.. సంబేపల్లె మండలానికి చెందిన మృతుడు చిన్నమండెం నుంచి రాయచోటి వైపు వెళ్తుండగా.. పడమటికోన గ్రామానికి చెందిన యానిమేటర్ శ్రీధర్ ఎంపీడీవో కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయానికి మంగళవారం మధ్యాహ్నం కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై వస్తున్నాడు. కాగా శ్రీధర్ వెలుగు కార్యాలయానికి క్రాస్ అవుతుండగా విజయ్ ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన విజయ్‌ను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు వారి మిత్రులు తెలియజేశారు. దీనిపై ఎస్ఐ సుధాకర్ వివరణ కోరగా... ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లపై ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ల ఉద్యమం బలోపేతం చేద్దామని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. దేశంలో మెజారిటీ ప్రజలు లబ్ధి పొందుతున్న రిజర్వేషన్లకు ప్రైవేటు రంగాలు మంగళం పాడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో మంగళవారం జరిగిన వీసీకే, బాస్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012లో ఎస్.ఆర్.మీనర్ కమిషనర్ ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్ల అమలుకు సిఫార్సు చేసి, డ్రాఫ్ట్ బిల్లు కూడా తీసుకొచ్చిందని గుర్తు చేశారు. వీటి అమలుకు చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలిపి, బలమైన ఉద్యమం నిర్మించేందుకు వీసీకే శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో బాస్ నేతలు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, బయన్న, రవిశంకర్, తెట్టు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి



కోటప్ప ఆచారి మృతదేహం

కలకడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో లారీ ఢీకొని వృద్ధుడు కోటప్ప ఆచారి (80) మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు గుడిబండ పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కోటప్ప ఆచారి సంతలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటికి వెళుతున్న లారీ ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స కోసం 108లో మహల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో మదనపల్లిలో కృష్ణారెడ్డి సిద్దార్థ కాలేజ్ విద్యార్థి కుమారి నూల అంజుమ్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందినట్లు జిల్లా ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతి అందుకొన్నట్లు తెలియజేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి డాక్టర్ రవి ఈ సందర్భంగా అభినందించారు. వీరికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని బహుమతి జాతీయ స్థాయి పోటీల అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఈనెల 24 నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు మంగళవారం ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన కుంభప్రోక్షణ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అధికారులు, అర్చకులు వీణరాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 923 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో వాటిలో 845 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన 77 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులపై నిర్దిష్ట గడువులోపల తగిన పరిష్కారం ఇవ్వాలని పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి పెట్టుబడి రాయితీ, విద్యుత్, రాయితీల కింద ఉత్పాదక, సేవా రంగాల్లోని 19 యూనిట్లకు రూ.56.94 లక్షల విలువైన రాయితీలు మంజూరు చేసినట్లు కమిటీ ఆమోదం తెలిపింది. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ పథకాల కింద లభించిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నూతన పారిశ్రామిక విధానాల అమలు విధి విధానాలను వివరించిన జనరల్ మేనేజర్, పరిశ్రమల స్థాపనకు సహకరించాల్సిందిగా అన్ని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణకిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మదనపల్లె




మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో సేదా ఫౌండేషన్ సభ్యులు హిందువులకు ఉచితం వినాయకుడి ప్రతిమలు, టెంకాయలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా పఠాన్‌ఖాదర్‌ఖాన్ వినాయక చవితి సందర్భంగా 200 మందికి వినాయకుడి ప్రతిమలు, పూజా సామగ్రి పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. ప్రజలందరూ చవితి పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకుడి ప్రతిమలను ప్రజలు ఉపయోగించాలన్నారు. పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ తమ సేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లగా వినాయకుడి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, జంగాల శివరామ్, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, షంషీర్, నాగూర్‌వలి, ఎం.ప్రభాకర్, సుద్దిళ్ల సుధాకర్, బ్రహ్మకుమారి సేవకులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ గౌరవ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో పీయంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, ప్రధానోపాధ్యాయులకు, యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణను ఉద్దేశించి ఈయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 39 పీయంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ కార్యకలాపాల కోసం సమగ్ర శిక్ష ద్వారా కేటాయించబడిన రూ.50 వేలను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో నిర్వహించాల్సిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగించారు. అనంతరం స్కౌట్‌లో శిక్షణ పూర్తి చేసిన యూనిట్ లీడర్లకు డీఈవో ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో షమీవుల్లా, స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

అనుకున్నదే...అయింది

- కొన్ని బార్లకు బోణీ కాలేదు
- ఏఈఆర్‌టీ ఎఫెక్ట్..
- మూడు బార్లకే దరఖాస్తులు



మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు అందరూ అనుకున్నదే అయ్యింది. వైసీపీ పాలనలో ప్రవేశపెట్టిన ఏఈఆర్‌టీ పన్నులతో కూటమి ప్రభుత్వం కూడా బార్ పాలసీ విధానాన్ని ఈసారి కూడా కొనసాగించడంతో జిల్లాలో 11 బార్లకు కేవలం 15 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. నష్టం కలిగించే ఈ వ్యాపారం తమకు వద్దంటూ మద్యం వ్యాపారులు కనీసం దరఖాస్తులు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఓపెన్ కేటగిరీ కింద 11 బార్లకు ఎక్సైజ్ అధికారులు వారం రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆసక్తి గల వ్యాపారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని 11 బార్లకు గాను మొత్తం 178 మంది వారి పేర్లను ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారే కానీ కేవలం 15 మంది మాత్రమే రూ.55 లక్షలు చొప్పున డిపాజిట్, రూ.10 వేలు చొప్పున చెల్లించి పూర్తి స్థాయిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాజంపేటలోని రెండు బార్లకు, రాయచోటిలోని ఒక బార్‌కు మాత్రమే లక్కీ డ్రా నిర్వహించేందుకు పెట్టిన నిబంధన ప్రకారం నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మదనపల్లెలో ఐదు బార్లకు, పీలేరులో ఒక బార్‌కు గాను కేవలం 3 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దీంతో మదనపల్లె, పీలేరు బార్లకు లక్కీ డ్రా నిర్వహించే వీలులేకుండా పోయింది. రాష్ట్రంలో 840 బార్లకు నోటిఫికేషన్ జారీ చేస్తే కేవలం 56 బార్లకు మాత్రమే లక్కీ డ్రా నిర్వహించేందుకు సరిపడా దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ హడావుడిగా ఉత్తర్వులు జారీ చేశారు. బార్ల లక్కీడ్రాకు దరఖాస్తుల గడువు మరో మూడు రోజులు అంటే 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. అప్పటికైనా బార్లకు దరఖాస్తులు వస్తాయా, రావో వేచిచూడాల్సి ఉంది.

ఏఈఆర్‌టీ ఎఫెక్ట్

బార్ల పాలసీ ప్రకారం అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నులు 15 శాతం చెల్లించాలి. అంటే మద్యం దుకాణాలకు సరఫరా చేసే మద్యం ధరల కన్నా, బార్లకు సరఫరా చేసే మద్యం ధరలు 15 శాతం ఎక్కువగా ఉంటాయి. దీంతో బార్ల యజమానులకు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగవు, లాభాలు రావు. ఈ విషయమై అప్రమత్తమైన మద్యం వ్యాపారులు చాలామంది బార్లు దక్కించుకోవడానికి ముందుకు రాలేదని తెలుస్తోంది.

30వ తేదీ రాయచోటిలో లక్కీడ్రా

జిల్లాలో 11 బార్లకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో వినాయచవితి పండుగ రావడం, బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో తక్కువ దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ చెప్పారు. ఎక్కువమంది దరఖాస్తులు చేసుకుంటేనే బార్లకు లక్కీ డ్రా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బార్లకు దరఖాస్తుల గడువు ఈనెల 29వ తేదీ వరకు పొడిగించామన్నారు. 30వ తేదీ ఉదయం 8 గంటలకు రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు.

క్రీడా మాస్టారు....



స్వర్ణ పతకం అందుకుంటున్న వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శివశంకర్‌రెడ్డి



అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

వ్యాయామ ఉపాధ్యాయుడిగా అంతర్జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించడమే ఏకైక లక్ష్యం. అంతేకాక జాతీయ స్థాయిలో జరిగే స్కూలుగేమ్స్ పోటీల్లో మా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యేలా నైపుణ్య శిక్షణ ఇవ్వడం.. ఎంపికైన క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటేలా.. తీర్చిదిద్దడమే ధ్యేయం.

- బి.శివశంకర్‌రెడ్డి, పీఈటీ, గంగనపల్లె జడ్పీ హైస్కూలు

- క్రీడాకారులకు.. నైపుణ్య శిక్షణ
- ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వైనం
- క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ

కడప స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యాల్లా దాగి ఉన్న క్రీడాకారులను వెలికితీస్తూ.. వారిలో నూతన ఉత్తేజాన్ని నింపుతూ... వివిధ క్రీడా విభాగాల్లో రాణించేలా తనదైన మార్కు శిక్షణ ఇస్తున్నారు వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి. అదే విధంగా ఐదు పదుల వయసులోనూ తనలోని క్రీడాకారుడి తృష్టను తీర్చుకుంటూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు.. ఆయన గురించి వివరాల్లోకి వెళితే..

పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శివశంకర్‌రెడ్డి ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన కొంత మంది ఔత్సాహిక విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. ఈయన 2002లో వీరపునాయునిపల్లె మండలం గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరి సుమారు 8 సంవత్సరాల పాటు అక్కడ సేవలందించారు. సదరు పాఠశాలలోని 12 మంది విద్యార్థులను జాతీయ స్థాయిలో, మరో 40మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చారు. 2009 నుంచి 2017 జూన్ వరకు కమలాపురం మండలం చిన్నచెప్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవలందిస్తూనే అక్కడి పది మంది విద్యార్థులను జాతీయ స్థాయికి, మరో 30 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. 2017 నుంచి 2023 వరకు ముద్దనూరు మండలం ఉప్పలూరు జిల్లాపరిషత ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి, 8 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా కఠోర శిక్షణ ఇచ్చారు. ఇదంతా ఒక ఎత్తయితే ఆయనలోని క్రీడాకారుడి తృష్టను తీర్చుకునేలా వివిధ క్రీడా విభాగాలను ఎంచుకుని విద్యార్థులతో పాటు ప్రతిరోజూ సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను చాటుతున్నారు.

ఐదు పదుల వయసులో...

సాధించాలనే పట్టుదల ఉండాలే కానీ... వయస్సు బలాదూర్ అని నిరూపిస్తున్నా శివశంకరెడ్డి. ఆ కోవలో 2022లో గుంటూరు జిల్లా నంబూరులో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టరు క్రీడాపోటీల్లో పాల్గొని హైజంప్, ట్రిబుల్ జంప్ విభాగంలో బంగారు పతకాలు సాధించి తన సత్తా నిరూపించారు. 2024 మే 22, 23, 24 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పాన్ ఇండియా జతీయ స్థాయిలో పాల్గొని లాంగ్‌జంప్, హైజంప్, ట్రిబుల్ జంప్, క్రీడావిభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. తద్వారా అంతర్జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ (ఆస్ట్రేలియా)కు ఎంపికయ్యారు. 2025 ఫిబ్రవరిలో అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ పోటీల్లో పాల్గొని లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో ప్రథమ విజేతగా ట్రిబుల్‌జంప్‌లో ద్వితీయ విజేతగా నిలిచి.. జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు నలుగురు ఎంపిక



వాణి, ఇందు, త్రివేణి, వర్షిణి

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నలుగురు బాలికలు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 24న రాజంపేటలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో సీనియర్, సబ్‌జూనియర్ విభాగంలో మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన జి.వాణి, లావనూరు గ్రామానికి చెందిన సి.ఇందు ఎంపికయ్యారు. అలాగే సబ్ జూనియర్ విభాగంలో తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్ విద్యార్థులు త్రివేణి, వర్షిణిలు ఎంపికయ్యారు. వీరు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఉపాధ్యక్షుడు శివనారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, వెంకటరమణలు హర్షం వ్యక్తం చేశారు.

తహలీల్ ఫాతెహాతో ముగిసిన ఉరుసు ఉత్సవాలు



ఉరుసు ముగింపులో దర్గా పీఠాధిపతి

కడప కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప అమీన్‌పీర్ దర్గా పదవ పీఠాధిపతి ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ గంధమహోత్సవం గత మూడు రోజులుగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కాగా మంగళవారం తహలీల్ ఫాతెహాతో ఉరుసు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు హాజరై మొక్కుబడులను తీర్చుకున్నారు. ఇందులో భాగంగా అమీన్‌పీర్ దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా హుస్సేనీ మూడు రోజులుగా దర్గా ఆవరణలో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఇందులో వైద్యులు షాజహాన్, లోకనాథ్, ఇంతియాజ్, ఖాదర్‌మస్తాన్‌బి, లాల్, అబూబకర్ సిద్ధిక్ భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే దుకాణదారులు ఎరువులు విక్రయించాలని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల ఆదేశాల మేరకు మైదుకూరు మండలం జీవిసత్రంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, అగ్రికల్చర్, పోలీసు అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు.ఎరువుల దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. రికార్డులు రాయకుండా ఉన్న యూరియా బస్తాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రనాయక్, ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో బాల గంగాధర్‌రెడ్డి, సీఐ రమణారెడ్డి, విజిలెన్స్ సీఐ శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

- బంగారు, వెండి నగలు, నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు, నగదు, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కడప డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్, బాచారావువీధికి చెందిన షేక్ ఇబ్రహీం ఖలీలుల్లా స్నేహితులు. వీరు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడేవారు. ఇటీవల కడప ఎన్జీవో కాలనీలోని ఓ ఇంటిలో, రవీంద్రనగర్, మురాది యాన గర్‌లె రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు వీరిపై ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామని తెలిపారు. ఇరువురు దొంగలించిన డబ్బు, బంగారుతో పారిపోతున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో తాడిపత్రి- తిరుపతి బైపాస్‌రోడ్డులోని నానాపల్లె క్రాస్ వద్ద దాడి చేసి అరెస్టు చేశా మన్నారు. వారి వద్ద నుంచి 43 గ్రాములు బంగారు నగలు, 340 గ్రాములు వెండి, రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బ్రహ్మంసాగర్‌లో కాలు జారిపడి మహిళ మృతి



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో ప్రమాదవశాత్తు కాలు జారిపడి మడక లక్ష్మి దేవి (39) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. వివరాల మేరకు... బి.మఠం మండలంలోని నరసన్నపల్లె గ్రామానికి చెందిన మడక రమణయ్య భార్య లక్ష్మీదేవి బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు వచ్చారు. మంగళవారం తెల్లవారుజామున బ్రహ్మంసాగర్ వద్దకు వెళ్లి స్నానం చేసేందుకు దిగడంతో కాలు జారి నీళ్లలో పడి పోయింది. గమనించిన కుమా రుడు అక్కడున్న వారికి తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణలో గాయపడిన యువకుడి మృతి

దువ్వూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):ఘర్షణలో గాయపడిన పాలగిరి చెన్నయ్య (29) అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని మదిరేపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పాలగిరి చెన్నయ్య (29) అదే గ్రామానికి చెందిన ఎ.సంజీవరెడ్డి, యోనా, మనోహర్ అనే వ్యక్తులు ఈ నెల 24వ తేదీ మనేరాంపల్లి-పెద్దశింగనపల్లె మార్గమధ్యంలో మద్యం తాగేందుక వెళ్లారు. వీరంతా కలిసి కూర్చొని మద్యం తాగుతుండగా.. బాకీవిషయమై చెన్నయ్య, సంజీవరెడ్డిల మధ్య గొడవ జరిగింది. సంజీవరెడ్డి మద్యం మత్తులో చెన్నయ్యకు బైకు తగిలించగా కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అటు నుంచి తిరిగి ప్రొద్దుటూరుకు తరలించగా ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి సత్యరాజు ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు.

టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడి

- పోలీసు స్టేషన్ పక్కనే ఇరువర్గాల ఘర్షణ



పోలీసు స్టేషన్ పక్కనే ఇరువర్గాలకు చెందిన వారు

పెండ్లిమర్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పక్కనే టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డిపై మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, శివారెడ్డిలు దాడి చేశారు. కోరవాండ్లపల్లెకు చెందిన యాదవులకు, దాడి చేసిన వారికి కొంత కాలం నుంచి భూసమస్య ఉంది. ఈవిషయంలో గంగిరెడ్డి జోక్యం చేసుకుంటున్నాడని కక్ష గట్టి సమయం కోసం వేచి ఉన్నారు. పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న టీ దుకాణంలో గంగిరెడ్డి టీ తాగుతుండగా గమనించి దాడికి పాల్పడ్డారు. దాడి జరిగిన తరువాత పోలీసులు వచ్చి దాడి చేసిన వారిని వీఎన్‌పల్లె పోలీసు స్టేషన్ తరలించారు. మళ్లీ మధ్యాహ్నం ఇరువర్గాలవారు తమ అనుచరులను పిలిపించు కుని అదే పోలీసుస్టేషన్ పక్కలోనే రాళ్లు, కర్రలతో పరస్పరం దాడు లకు పాల్పడ్డారు. దీంతో కొంతమందికి గాయాలయ్యాయి. రెండోసారి గొడవకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై పెండ్లిమర్రి గ్రామ ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి స్టేషన్‌లో సీఐ ఉండగానే ఘర్షణ జరగడం గమనార్హం. కాగా, టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి ఫిర్యాదు మేరకు 6 మందిపై కేసు నమోదు చేశామని, రెండోసారి జరిగిన గొడవలో ఇరువర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

డొంకుపల్లె గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలి

- కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని డొంకుపల్లె గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ డొంకుపల్లెలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్థులు తిమ్మాపురం చెరువు బ్యాక్‌వాటర్ గ్రామం చుట్టూ చేరిందని.. దీంతో గ్రామంలోకి వచ్చే దారులన్నీ బంద్ అయ్యాయని కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో 42కుటుంబాలు ఉన్నాయని, గ్రామం చుట్టూ నీరు చేరడం వల్ల గ్రామాన్ని ఖాళీ చేసినట్లు తెలిపారు. వెంటనే తమ గ్రామాన్ని ముంపులోకి చేర్చాలని వారు కలెక్టర్‌ను కోరారు. అదే విధంగా చిన్నపల్లె గ్రామంలో కూడా తిమ్మాపురం చెరువు బ్యాక్‌వాటర్ వస్తుండటం వల్ల తమ గ్రామాన్ని ముంపులోకి చేర్చారని, అయితే ఇంతవరకు పరిహారం రాలేదని గ్రామస్థులు వివరించారు. గెజిట్ అయిన ఇంకా పరిహారం రాలేదని, వెంటనే పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గురప్ప, మండల కూటమి నాయకులు శివనారాయణరెడ్డి, వైవీ నారాయణరెడ్డి, బాబురెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గండికోట నుంచి పైడిపాలెంకు నీరు నిలుపుదల

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి పైడిపాలెం రిజర్వాయర్‌కు నీరు నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా మంగళవారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,700 క్యూసెక్కులు ఉందన్నారు. జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,500 క్యూసెక్కులు, వరదనీరు 200 క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

ఉపాధి వనరులకు కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు



కొప్పర్తి పారిశ్రామికవాడలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

సీకేదిన్నె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి వనరుల అడ్డాగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు నిలుస్తుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి వద్ద 600 ఎకరాల్లో ఏర్పాటు అయిన మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో మంగళవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 2న నారా లోకేశ్ పర్యటన సందర్భంగా ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ గెస్టుహౌస్, టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, రెడీమేడ్స్ సూట్స్ తయారు చేసే టెక్సానా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలను, కంపెనీలలో ఉత్పత్తిని మంత్రిచే ప్రారంభించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా పరిశ్రమలను పరిశీలించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ పార్కులో ఎల్ఈడీ మానిటర్ల ఉత్పత్తి, టెక్నోడోమ్, రెడిమేడ్ సూట్స్, తదితర ఉత్పత్తులను పరిశీలించి వాటి నాణ్యతను, మన్నికను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కొప్పర్తి పారిశ్రామిక వాడను ఉపాధి హబ్‌గా మార్చేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రియల్ జీఎం చాంద్‌బాష, తహసీల్దారు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన నైపుణ్యతలే అవకాశాలకు మార్గాలు : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు జ్ఞాన నైపుణ్యాలను పొందినపుడే అవకాశాలను అందుకోగలుగుతామని యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం రీసెంట్ అప్లికేషన్ ఆఫ్ ఫొటోనిక్ టెక్నాలజీ అనే అంశంపై ప్రత్యేక శాస్త్రీయ ఉపన్యాసం విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. ఆచార్య అల్లం శ్రీనివాసరావు సైంటిఫిక్ లెక్చర్ ఇచ్చేముందు విద్యార్థుల్లో ప్రేరణ ఉపన్యాసం చేశారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ఎప్పుడు ప్లాన్ చేసుకోవాలన్నారు. తక్కువ శ్రమ ఎక్కువ ఫలితాలు కావాలని కోరుకోవద్దన్నారు. పెరుగుతున్న పోటీకి తగ్గట్లు సన్నద్ధత కాకపోతే అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరని గుర్తుచేశారు. అనంతరం వీసీని ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, ఆచార్య రఘునాథరెడ్డి సత్కరించారు. కార్య క్రమంలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

- అఖిలపక్షం నేతల డిమాండ్

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నె పల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి అనుమా నాస్పదస్థితిలో మృతి చెందిన విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు నారాయణ, నగిలి గురప్ప, రవిశంకర్‌రెడ్డి, ఎస్ఏ సత్తార్, సీఆర్వీ ప్రసాద్, బండెల ఓబయ్య మాట్లాడారు. ఆగస్టు 4న ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సుబ్బిరెడ్డి ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 8వ తేదీ మృతి చెందారు. ఈసంఘటనపై బాధిత కుటుంబ సభ్యులతో కలిసి బి.మఠం పోలీసుస్టేషన్‌లో లెక్కల రమణారెడ్డి మరికొందరిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. సుబ్బిరెడ్డి, లెక్కల రమణారెడ్డికి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదాలు ఉన్నా యి. ఈ విషయంపై బి.మఠం పోలీసుస్టేషన్ వెళ్లి వచ్చిన తరువాత భూమిరెడ్డి సుబ్బిరెడ్డి విషద్రావణం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో తనకు అవమానం జరిగిందని తన కుటుంబ సభ్యులతో తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాక సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి చనిపోయాడని, ఈ మరణం వెనుక అనేక అనుమానాలున్నాయని తెలిపారు. పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుని వాస్తవాలు వెలికితీయాలని కోరారు. జిల్లా ఎస్పీ స్పందించి నసమగ్ర విచారణ జరిపించి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

classified ఆంధ్రజ్యోతి lines

సర్టిఫికెట్స్ పోయినవి

మద్దిరాల గోకుల్ తండ్రి మద్దిరాల గోపాల్, D.No. 21/46-A, హరిజనవాడ ఉర్లగడ్డపోడు విలేజ్, ఎస్.వి.నగర్, రైల్వే కోడూరు మండలం, అన్నమయ్య జిల్లా, A.P., రైల్వే కోడూరు టౌన్ శ్రీ సాయినగర్‌లోని శ్రీ సాయి డిగ్రీ కాలేజ్ నందు చదివిన TC No. 5547/2019-20, నేను ఇల్లు మారుతుండగా పోయినది. దొరికినవారు అందజేయగలరు Ajc-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647. AJA- 246568

యూనిట్ కార్యాలయం

9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ముగిసిన అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు



వాలీబాల్ ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మూడు రోజులపాటు నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ముగిశాయి. పది క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌కు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈనెల 29న విశాఖలో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేయనున్నారు. ముగింపు కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో ఛాలెంజ్‌గా తీసుకొని మూడు రోజులుగా రాష్ట్రస్థాయి పోటీలు దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఒలింపిక్, కామన్‌వెల్త్, ఏసియన్ గేమ్స్‌లో రాణించి దేశం గర్వించేలా పతకాలు సాధించాలని కోరారు. నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, ఎస్వీయూ, మహిళా వర్శిటీలలో బస ఏర్పాటు చేశామన్నారు. రవాణా, ఇతర ఏర్పాట్లు కల్పించడంతో ఎక్కడా లోటుపాట్లు, ఫిర్యాదులు అందలేదన్నారు. తిరుపతిలో మరింత పెద్దస్థాయిలో క్రీడలు నిర్వహించుకునే అవకాశం ఈ పోటీల ద్వారా నిరూపితమైందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనరు మౌర్య, శాప్ డైరెక్టర్లు రజని, సంతోష్, అధికారులు కోటేశ్వరరావు, శశిధర్, బాలాజీ పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు విన్నర్స్, రన్నర్స్‌గా....

అథ్లెటిక్స్: పురుష విభాగంలో శ్రీకాకుళం, కాకినాడ, పల్నాడు, కడప విన్నర్స్‌గాను.. అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), పల్నాడు, కడప రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో విజయనగరం, అనకాపల్లి, కడప విన్నర్స్‌గాను.. విజయనగరం, కాకినాడ, గుంటూరు, కడప రన్నర్స్‌గా నిలిచాయి.

షటిల్ బాడ్మింటన్: పురుష విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ కోనసీమ విన్నర్స్‌గా.. సింగిల్స్‌లో ఎన్టీఆర్, డబుల్స్‌లో పశ్చిమగోదావరి రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ విన్నర్స్‌గా ఎన్టీఆర్ జిల్లా నిలవగా.. రన్నర్స్‌గా సింగిల్స్‌లో కడప, డబుల్స్‌లో ఎన్టీఆర్ నిలిచాయి.

బాస్కెట్‌బాల్: పురుష విభాగంలో చిత్తూ రు, కడప.. మహిళా విభాగంలో ఏలూరు, వైజాగ్ విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

వెయిట్ లిఫ్టింగ్ : పురుష విభాగంలో విన్నర్స్ వైజాగ్, అనకాపల్లి, కడప, గుంటూరు, వైజాగ్, గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, కడప, కర్నూల్. మహిళా విభాగంలో విన్నర్స్ కాకినాడ, రన్నర్స్ వైజాగ్.



చవితి ఉత్సవాలకు సిద్ధం

● ఆకాశాన్నంటిన పూల, కూరగాయల ధరలు ● కిటకిటలాడిన మార్కెట్ ● కేరింతలు కొడుతున్న యువత





రైల్వేకోడూరులో వినాయకుడి ప్రతిమలను విక్రయిస్తున్న వ్యాపారులు, రైల్వేకోడూరు బలిజవీధిలో విద్యుత్‌కాంతులు, మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ నరసింహకుమార్

రైల్వేకోడూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. రైల్వేకోడూరు వ్యాప్తంగా రకరకాల అలంకరణలతో మండపాలను సిద్ధం చేశారు. బుధవారం ఉదయాన్నే పూజలు ప్రారంభిస్తారు. ప్రతి మండపం వద్ద అరటి పిలకలు, పూలు, పండ్లు, అరటి ఆకులు తదితర వాటిని ఏర్పాటు చేసుకున్నారు. చవితి సందర్భంగా రైల్వేకోడూరులో పూల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో కనకాంబరం పూలు రూ.వెయ్యి, రోజా, చామంతి పువ్వులు కిలో రూ.500 నుంచి రూ.600లకు విక్రయాలు చేశారు. ఇక అరటిపండ్లు డజన్ 100కు అమ్మకాలు జరిగాయి. పండుగ సందర్భంగా కూరగాయల ధరలూ అమాంతం పెరిగాయి. సామాన్య ప్రజలు కొనలేని తినలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

పండుగను ఆనందంగా జరుపుకోవాలి

● తహసీల్దార్ నరసింహకుమార్

రాయచోటిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ మట్టి వినాయక ప్రతిమలతో వినాయక చవితి పండుగను ఆనందంగా జరుపుకోవాలని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, అర్బన్ సీఐ వెంకటాచలపతి, మున్సిపల్ కమిషనర్ జి.రవి, మానవత సంస్థ చైర్మన్ శివగంగిరెడ్డిలు కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల కరస్పాండెంట్, మానవతా సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డిల సౌజన్యంతో మానవత సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, కోచైర్మన్ షకీల్, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, శివరామకృష్ణ, ట్రెజరర్ నాగార్జున, మాజీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ పలువురికి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. సాయినగర్‌కు చెందిన సుంకర సుబ్బరాయుడు, వారి కుటుంబ సభ్యులు, మన్నూరుకు చెందిన గంగనపల్లి వెంకటరమణ, హైమావతి దంపతులు కలిసి ఆర్టీసీ బస్టాండు, సాయి బాబ గుడి ఆవరణంలో వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే మట్టి వినాయక బొమ్మలను అందరూ వాడాలని పిలుపునిచ్చారు.

పుల్లంపేట: మండల పరిధిలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు వినాయకుని వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో మట్టి బొమ్మలను తయారు చేయించారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి విద్యార్థులందరూ తమ ఇళ్లల్లో మట్టి విగ్రహాలను పూజకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరత్నం, మల్లికార్జున, ఇంద్రావతి, ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణుడు, పీడీ సాయి తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మట్టి గణపతే మహాగణపతి అని జీవవైవిద్య అవార్డు గ్రహీత మోపూరి శ్రీనాధరెడ్డి అన్నారు. చవితి సందర్భంగా భక్తులకు తన సొంత నిధులతో మట్టి గణపయ్యలను వితరణ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ యువనాయకుడు అంజనారెడ్డి, మాధవి, శివారెడ్డి, అయోధ్యాపురం పట్టాభిరెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మానవతా సంస్థ ఆధ్వర్యంలో 200 వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేసినట్లు జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రాయచోటి ప్రతిభా సంస్థల అధినేత శివగంగిరెడ్డి సహకారంతో భక్తులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మానవతా సీనియర్ డైరెక్టర్ రవీంద్రనాధ్‌రెడ్డి, నరసింహ, గణపతి, ప్రకాశ్‌నాయక్, నటేశ్‌కుమార్, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 పంచాయతీ బంగారుపేట గ్రామ శివారులో వెలసిన గంగాభవాని అమ్మవారి ఆలయ సన్నిధిలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపట్టినట్లు నిర్వాహకులు మాడా సుబ్బరాయుడు, రామకృష్ణలు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు మట్టి వినాయక ప్రతిమలు స్వీకరించాలని కోరారు.

ఘనంగా వీరభద్రస్వామి జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య వీరభద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఆయన జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీభద్రకాళీ సమేత వీరభద్రుడు యాలి వాహనంపై రాయచోటి పరవీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

గోపగుడిపల్లెకు జలకళ



గోపగుడిపల్లెలో బోరు వేస్తున్న దృశ్యం

రామాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె గ్రామ పంచాయతీలో గత కొన్ని రోజులుగా నీటి సమస్యతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. వెంటనే ఈ విషయాన్ని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన మంగళవారం బోరు వేపించారు. నీరు సంవృద్ధిగా పడడంతో టీడీపీ నాయకులు వెంకట్రామరాజు, సుబ్బారెడ్డి, మల్లయ్య, నాగేంద్ర, కార్యకర్తలు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించండి : డాక్టర్

సిద్దవటం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ చిరంజీవిరెడ్డి ప్రజలకు సూచించారు. సిద్దవటంలోని 30 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగుల సంఖ్య పెరగడంతో వైద్యులు చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం తగు సూచనలు అందించారు. ముఖ్యంగా గృహ పరిసరాల్లో నీటిగుంటలు లేకుండా చూడాలని, దోమలు ఉత్పత్తి కాకుండా, గృహాల్లో ఉండే పూలమొక్కల్లో నీరు లేకుండా చూడాలన్నారు. రాత్రి వేళల్లో ప్రతిఒక్కరూ దోమతెరలు వాడాలని, తాగునీరు కాచి చల్లార్చిన తర్వాత తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం గొప్పవరం

ఓబులవారిపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమంలోని పేదలు, వృద్ధులకు అన్నదానం చేయడం గొప్పవరమని జీవన జ్యోతి ఆనంద నిలయం ఆశ్రమ వ్యవస్థాపకుడు పాణ్యం సుబ్రమణ్యం అన్నారు. చిట్వేలి మండలానికి చెందిన న్యాయవాది ఆర్.మల్లికార్జుననాయుడు, స్రవంతి దంపతుల కుమారులు క్రిష్ కార్తికేయ, కేతన్‌చౌదరిల పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, అనాథలు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ రఘురామయ్య, ఆశ్రమ నిర్వాహక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సిద్దవటం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపురం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం మండల టీడీపీ నేతలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం కడుపునిండా తింటున్నారని, గత ప్రభుత్వంలో విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యత లోపం వల్ల ఇబ్బందులు పడేవారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సయ్యద్ జవహర్‌బాషా, రాజంపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో వర్షం

పెనగలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన కారణంగా మంగళవారం సాయంత్రం మండలంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఏడు గంటల నుంచి ప్రారంభమైన వర్షపు చినుకులు 8 గంటల దాటినప్పటికి కురుస్తూనే ఉన్నాయి. అయితే ఆరు గంటల నుంచి మండల కేంద్రంలోని సుమారు పది గ్రామాల్లో ప్రతిష్ఠ చేసేందుకు హైస్కూల్ మైదానం వరకు తీసుకుని వచ్చిన వినాయక విగ్రహాలు వర్షం ఆగిపోయేంతవరకు అక్కడే నిలిపివేశారు. కొన్ని గ్రామాల విగ్రహాలు మాత్రం కురుస్తున్న చినుకులను లెక్కచేయకుండా తీసుకెళ్లడం జరిగింది.





నిబంధనలు పాటించాలి : సీఐ



పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

రైల్వేకోడూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయకుడి మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, ఎస్ఐ ఎల్వీ లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో వినాయకుడి కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవ విగ్రహాల ఏర్పాటు విషయంలో ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం వద్ద ఊరేగింపు, రాజకీయ ప్రేరేపితమైనవి చేయరాదన్నారు. ఉద్దేశపూర్వకమైన పాటలు, ప్రకటనలు చేయరాదన్నారు. మండపం వద్ద అశ్లీల నృత్యాలు చేయరాదన్నారు. పోలీసులు నిర్దేశించిన విధంగా రాత్రి 10.30 సమయం వరకు సౌండ్ సిస్టంను వినియోగించుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. రాత్రి వేళ తప్పనిసరిగా ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు మండపం దగ్గర బస చేయాలన్నారు. ఉత్సవంలో చిన్న పిల్లలను నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలనారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రామ పోలీస్, వీపీవో, నోడల్ ఆఫీసర్ చెప్పిన సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. పండుగను శాంతియుతంగా నిర్వహించాలని కోరారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి : ఎంపీడీవో

పుల్లంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో జయశ్రీ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమంపై వివిధ శాఖల సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు ప్రయత్నం చేసి అక్షరాస్యత శాతాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీడీవో

ఓబులవారిపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీడీవో మండల ప్రత్యేక అధికారి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలను మండల పరిధిలోని గాదెల, జీవీపురం, మంగంపేట గ్రామ పంచాయతీల్లో పరిశీలించారు. సంపద తయారీలో భాగంగా తయారైన వర్మీకంపోస్టు ఎరువును పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఈవోఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్ఐ నవీన్‌బాబు

చిట్వేలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే అవస్థలు తప్పవని ఎస్ఐ నవీన్‌బాబు హెచ్చరించారు. బుధవారం వినాయకచవితిని పురస్కరించుకుని పోలీసుస్టేషన్‌లో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సుమారు 120 వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిమజ్జనం తేదీలను ముందుగానే తెలపాలని సూచించారు. మండలంలోని 90 శాతం విగ్రహాలను ఎల్లమరాజు చెరువులో నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున మంగళవారం సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి చెరువును సందర్శించామని అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. నిమజ్జనాలు ముగిసేవరకు ఉత్సవ కమిటీలే బాధ్యత తీసుకోవాలన్నారు.

అదుపు తప్పిన వాహనం-వ్యక్తి మృతి

● మరొకరికి గాయాలు



మృతిచెందిన నాయబ్ రసూల్

సిద్దవటం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి సిద్దవటం మండలం కనుమలోపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో ఒకవ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి బలమైన గాయాలయ్యాయి. గోపవరం మండలం బద్వేల్ అర్బన్‌లోని శివానగర్ గ్రామానికి చెందిన నాయబ్‌రసూల్(25) హర్షవర్ధన్ అనే ఇరువురు మంగళవారం సాయంత్రం కడప నుంచి బద్వేల్‌కు వెళుతుండగా అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో నాయబ్ రసూల్ అనే వ్యక్తి మృతి చెందాడు. మరోవ్యక్తికి బలమైన గాయం తగలడంతో మెరుగైన వైద్యం కోసం 108లో కడప రిమ్స్‌కు తరలించారు. ఘటన స్థలానికి ఎస్ఐ మహమ్మద్‌రఫీ చేరుకుని విచారిస్తున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి : పీడీ

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం సిబ్బందికి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్ష్యాలు పూర్తి స్థాయిలో సాధించాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం లక్ష్యాలు సాధనకు నిరంతరం పనిచేయాలన్నారు. కూలీలకు 100 రోజులు పని కల్పించడంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. లక్ష్యాలు సాధించడంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఏపీడీ లక్ష్మీనరసయ్య, మండల అభివృద్ధి అధికారి ఉషారాణి, ఏపీవోలు మురళీ, పెంచలయ్య, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

అనధికార లే-అవుట్లు క్రమబద్ధీకరణ చేసుకోవాలి : ముక్కా



సమావేశంలో మాట్లాడుతున్న కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి

రైల్వేకోడూరురూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అనధికార లే-అవుటు, ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకోవాలని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడూరు మండలంలో 35 అనధికార లే-అవుట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. లే-అవుట్లు క్రమబద్దీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 24 వరకు గడువును పొడిగించిందని తెలిపారు. జూన్ 30వ తేది లోపు రిజిస్టర్ కాబడిన అనధికార ప్లాట్లు మరియు లే-అవుట్లు కు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. క్రమద్దీకరణ లేని లే-అవుట్లు మరియు ప్లాట్లుపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కృష్ణసింగ్, జేపీవో ఇందు, ఎంపీడీవో నాగుర్జున, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో జిల్లా సాధన పోరాటం ఉధృతం

● ప్లకార్డులతో నిరసన




రాజంపేటలో ప్లకార్డులతో ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల సంఘం నేతలు

రాజంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో జిల్లా సాధన కోసం ఆందోళనలు ఉధృతమయ్యాయి. ఇందులో భాగంగా మంగళవారం రాజంపేట పాతబస్టాండు సమీపంలో జేఏసీ నాయకులు పూల భాస్కర్, పోతుగుంట నాగేశ్వరరావు, పోకల ప్రభాకర్, మైనార్టీ నాయకులు తదితరులు కలిసి రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ వెనువెంటనే రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటించిన స్థలంలోనే వీరు ఆందోళనలు చేశారు. ఈ ఆందోళలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు సీఎం, ఉప ముఖ్యమంత్రి కలిసి ఇచ్చిన హామీ మేరకు జిల్లా కేంద్రం చేయాలని నినాదాలు చేశారు.

జేఏసీ ఆధ్వర్యంలో

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని చేసే ఉద్దేశ్యంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు ప్రభాకర్‌నాయుడు తదితరులు కలిసి టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజును మద్దతు కోరారు. గురువారం జరిగే జేఏసీ సమావేశానికి చమర్తిని ఆహ్వానించారు.

బార్ అసోసియేషన్ తీర్మానం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ప్రత్యేక తీర్మానం చేస్తూ ఇందుకు సంబంధించిన తీర్మాన పత్రాన్ని సీఎం చంద్రబాబుకు పంపుతున్నట్లు తెలిపారు. టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ చమర్తికి వినతిపత్రం సమర్పించారు.

పోతుగుంట ఆధ్వర్యంలో

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

మట్టి గణపతే.. మహాగణపతి...



● మట్టి విగ్రహాలనే పూజిద్దాం
● ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో అనేక అనర్థాలు

గాలివీడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా మట్టి ప్రతిమలనే పూజించాలని పలువురు పెద్దలు అంటున్నారు. కానీ ఎన్నో ఆకృతుల్లో హానికరమైన రసాయన రంగులతో వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత, ప్రజలు వాటికి ఆకర్షితులవుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాల కోసం నేడు వాటినే మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మట్టి వినాయకులనే పూజించేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత ఈ దిశగా ఆలోచన చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ముప్పు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి త్వరగా కరగవు. ఈ ప్రతిమల్లో జిప్సం, గంధకం, మెగ్నీషియం పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి. వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిపిన నీటి వల్ల చర్మవ్యాధులు వస్తాయి.



మట్టి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నీటిలో కరగడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. రసాయన రంగులు కలిపిన నీరు పంట పొలాలకు అందించడం ద్వారా దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

జంతుజాలానికి ముప్పు



వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమను పూజించడం అన్ని విధాలా శ్రేయస్కరం. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలతో మానవాళికి కాదు జంతు జలానికి ఎంతో ముప్పు. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలను కాకుండా మట్టి వినాయక ప్రతిమలనే మండపాల్లో ప్రతిష్ఠించుకోవాలి.

\- డాక్టర్ రామచంద్రారెడ్డి, గాలివీడు

అవగాహన కల్పిస్తున్నాం



మట్టి వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేసుకోవాలని ఎన్నో ఏళ్లగా అవగాహన కల్పిస్తున్నాం. మా సంస్థ ద్వారా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశాం.

\- ఆర్యశంకర్, సేవాభావం సంస్థ వ్యవస్థాపకుడు

మట్టి వినాయకులనే ప్రతిష్ఠిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా యువతను ప్రోత్సాహించాలి. రకరకాల రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ వాటి వల్ల చాలా ముప్పు ఉంటుంది. మట్టి ప్రతిమలతో ఉత్సవాలను చేసుకుందాం.

\- ఉదయ్‌కుమార్, గుండ్లచెరువు

గంజాయి మొక్కలు తొలగింపు



గంజాయి మొక్కల పెంపకంపై విచారణ చేస్తున్న సీఐ వరప్రసాద్

సుండుపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలు పెంచుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలు తొలగించినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురం బిడికీకి చెందిన మూడే సుబ్బరాంనాయక్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న సమాచారం వచ్చిందన్నారు. రాయచోటి ఎక్సైజ్, రెవెన్యూ అధికారులతో వెళ్లి మూడే సుబ్బరాంనాయక్ ఇంటి పరిసరాల్లో పెంచుకుంటున్న సుమారు 10 గంజాయి మొక్కలను తొలగించి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి మొక్కలు పెంచడం, సరఫరా చేయడం, గంజాయి వినియోగం చట్టరీత్యా నేరమని, అలా ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వద్దు

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివనారాయణ

నిమ్మనపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయపరపతి కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రైతులకు అందించే ఎరువుల కొరత లేదని అయితే రైతులు నానో యూరియా, డీఏపీలను వాడితే వరి పంటతో పాటు ఇతర పంటలకు పిచికారీ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన నిపుణులు ఉన్నారని తెలిపారు.

నానో ఎరువు బాటిల్‌లో లిక్విడ్ రూపంలో వస్తుందని ఇది పిచికారీ చేస్తే యూరియా కంటే ఎక్కువగా పనిచేసి అధిక పంటలు పండుతాయని తెలిపారు. నానో లిక్విడ్‌ను పంటలకు పిచికారీ చేసేందుకు ఎకరాకు కేవలం రూ. 300 మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపడితే ఎరువులతో పని వుండదని తెలిపారు. ప్రసుత్తం ప్రైవేటు ఏజెన్సీలకు 30 శాతం ప్రభుత్వానికి 70 శాతం ఎరువులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఎరువుల దుకాణ దారుల అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రరమేష్, ఏఓ మంజుల, సీఈవో హరినాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లపై ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ల ఉద్యమం బలోపేతం చేద్దామని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. దేశంలో మెజారిటీ ప్రజలు లబ్ధి పొందుతున్న రిజర్వేషన్లకు ప్రైవేటు రంగాలు మంగళం పాడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో మంగళవారం జరిగిన వీసీకే, బాస్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012లో ఎన్.ఆర్.మీనర్ కమిషనర్ ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలుకు సిఫార్సు చేసి, డ్రాఫ్ట్ బిల్లు కూడా తీసుకొచ్చిందని గుర్తు చేశారు. వీటి అమలుకు చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలిపి, బలమైన ఉద్యమం నిర్మించేందుకు వీసీకే శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో బాస్ నేతలు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, బయన్న, రవిశంకర్, తెట్టు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వండి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 923 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో వాటిలో 845 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన 77 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులపై నిర్ధిష్ట గడువులోపల తగిన పరిష్కారం ఇవ్వాలని పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహనికి పెట్టుబడి రాయితీ, విద్యుత్, రాయితీల కింద ఉత్పాదక, సేవా రంగాల్లోని 19 యూనిట్లకు రూ.56.94 లక్షల విలువైన రాయితీలు మంజూరు చేసినట్లు కమిటీ ఆమోదం తెలిపింది. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ పథకాల కింద లభించిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నూతన పారిశ్రామిక విధానాల అమలు విధి విధానాలను వివరించిన జనరల్ మేనేజర్, పరిశ్రమల స్థాపనకు సహకరించాల్సిందిగా అన్ని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణకిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మదనపల్లె



మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో సేదా ఫౌండేషన్ సభ్యులు హిందువులకు ఉచితం వినాయకుడి ప్రతిమలు, టెంకాయలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా పఠాన్‌ఖాదర్‌ఖాన్ వినాయక చవితి సందర్భంగా 200 మందికి వినాయకుడి ప్రతిమలు, పూజా సామగ్రి పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. ప్రజలందరూ చవితి పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకుడి ప్రతిమలను ప్రజలు ఉపయోగించాలన్నారు. పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ తమ సేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లగా వినాయకుడి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, జంగాల శివరామ్, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, షంషీర్, నాగూర్‌వలి, ఎం.ప్రభాకర్, సుద్దిళ్ల సుధాకర్, బ్రహ్మకుమారి సేవకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి



కోటప్ప ఆచారి మృతదేహం

కలకడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో లారీ ఢీకొని వృద్ధుడు కోటప్ప ఆచారి (80) మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు గుడిబండ పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కోటప్ప ఆచారి సంతలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటికి వెళుతున్న లారీ ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స కోసం 108లో మహల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ గౌరవ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో పీయంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, ప్రధానోపాధ్యాయులకు, యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణను ఉద్దేశించి ఈయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 39 పీయంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ కార్యకలాపాల కోసం సమగ్ర శిక్ష ద్వారా కేటాయించబడిన రూ.50 వేలను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో నిర్వహించాల్సిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగించారు. అనంతరం స్కౌట్‌లో శిక్షణ పూర్తి చేసిన యూనిట్ లీడర్లకు డీఈవో ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో షమీవుల్లా, స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో మదనపల్లిలో కృష్ణారెడ్డి సిద్దార్థ కాలేజ్ విద్యార్థి కుమారి నూల అంజుమ్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందినట్లు జిల్లా ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతి అందుకొన్నట్లు తెలియజేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి డాక్టర్ రవి ఈ సందర్భంగా అభినందించారు. వీరికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని బహుమతి జాతీయ స్థాయి పోటీల అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఈనెల 24 నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు మంగళవారం ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన కుంభప్రోక్షణ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అధికారులు, అర్చకులు వీణరాఘావచార్యులు, శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అనుకున్నదే...అయింది

● కొన్ని బార్లకు బోణీ కాలేదు
● ఏఈఆర్‌టీ ఎఫెక్ట్..
● మూడు బార్లకే దరఖాస్తులు



మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు అందరూ అనుకున్నదే అయ్యింది. వైసీపీ పాలనలో ప్రవేశపెట్టిన ఏఈఆర్‌టీ పన్నులతో కూటమి ప్రభుత్వం కూడా బార్ పాలసీ విధానాన్ని ఈసారి కూడా కొనసాగించడంతో జిల్లాలో 11 బార్లకు కేవలం 15 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. నష్టం కలిగించే ఈ వ్యాపారం తమకు వద్దంటూ మద్యం వ్యాపారులు కనీసం దరఖాస్తులు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఓపెన్ కేటగిరీ కింద 11 బార్లకు ఎక్సైజ్ అధికారులు వారం రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆసక్తి గల వ్యాపారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని 11 బార్లకు గాను మొత్తం 178 మంది వారి పేర్లను ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారే కానీ కేవలం 15 మంది మాత్రమే రూ.55 లక్షలు చొప్పున డిపాజిట్, రూ.10 వేలు చొప్పున చెల్లించి పూర్తి స్థాయిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాజంపేటలోని రెండు బార్లకు, రాయచోటిలోని ఒక బార్‌కు మాత్రమే లక్కీ డ్రా నిర్వహించేందుకు పెట్టిన నిబంధన ప్రకారం నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మదనపల్లెలో ఐదు బార్లకు, పీలేరులో ఒక బార్‌కు గాను కేవలం 3 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దీంతో మదనపల్లె, పీలేరు బార్లకు లక్కీ డ్రా నిర్వహించే వీలులేకుండా పోయింది. రాష్ట్రంలో 840 బార్లకు నోటిఫికేషన్ జారీ చేస్తే కేవలం 56 బార్లకు మాత్రమే లక్కీ డ్రా నిర్వహించేందుకు సరిపడా దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ హడావుడిగా ఉత్తర్వులు జారీ చేశారు. బార్ల లక్కీడ్రాకు దరఖాస్తుల గడువు మరో మూడు రోజులు అంటే 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. అప్పటికైనా బార్లకు దరఖాస్తులు వస్తాయా, రావో వేచిచూడాల్సి ఉంది.

ఏఈఆర్‌టీ ఎఫెక్ట్

బార్ల పాలసీ ప్రకారం అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నులు 15 శాతం చెల్లించాలి. అంటే మద్యం దుకాణాలకు సరఫరా చేసే మద్యం ధరల కన్నా, బార్లకు సరఫరా చేసే మద్యం ధరలు 15 శాతం ఎక్కువగా ఉంటాయి. దీంతో బార్ల యజమానులకు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగవు, లాభాలు రావు. ఈ విషయమై అప్రమత్తమైన మద్యం వ్యాపారులు చాలామంది బార్లు దక్కించుకోవడానికి ముందుకు రాలేదని తెలుస్తోంది.

30వ తేదీ రాయచోటిలో లక్కీడ్రా

జిల్లాలో 11 బార్లకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో వినాయచవితి పండుగ రావడం, బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో తక్కువ దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ చెప్పారు. ఎక్కువమంది దరఖాస్తులు చేసుకుంటేనే బార్లకు లక్కీ డ్రా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బార్లకు దరఖాస్తుల గడువు ఈనెల 29వ తేదీ వరకు పొడిగించామన్నారు. 30వ తేదీ ఉదయం 8 గంటలకు రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చిట్వేలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ టీమ్ మురళీకృష్ణ (ఫారెస్ట్ రేంజ్ అధికారి) ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులను, స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్స్‌ను, గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు అమ్మినా, నాణ్యతలేని, అనుమతులు లేని ఎరువులను అమ్మినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో అన్ని రికార్డులను, బిల్‌బుక్స్‌ను నిర్వహించాలని ఆదేశించారు. మన గ్రోమోర్, లక్ష్మీశ్రీనివాస, పరస్పర సహకార సంఘం, వెంకటసాయి ఆగ్రో ట్రేడర్స్ దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, విజిలెన్స్ కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

తంబళ్లపల్లె ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పెండూరివారిపల్లె వాసి పి.చంద్రశేఖర్ సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామచంద్రారెడ్డిపై దాడికి దిగాడు. బాధితుడి ఫిర్యాదుపై చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

ఆదర్శ పాఠశాల విద్యార్థిని



మధులత

పుల్లంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మధులత రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తెలిపారు. పులివెందులలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సిబ్బంది మధులత, పీడీ నీలకంఠరావులు విద్యార్థినిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



విజయ్ (ఫైల్‌ఫొటో)

చిన్నమండెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై కస్తూర్బా స్కూల్ ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని కంచపు విజయ్ (20) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకెళ్తే.. సంబేపల్లె మండలానికి చెందిన మృతుడు చిన్నమండెం నుంచి రాయచోటి వైపు వెళ్తుండగా.. పడమటికోన గ్రామానికి చెందిన యానిమేటర్ శ్రీధర్ ఎంపీడీవో కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయానికి మంగళవారం మధ్యాహ్నం కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై వస్తున్నాడు. కాగా శ్రీధర్ వెలుగు కార్యాలయానికి క్రాస్ అవుతుండగా విజయ్ ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన విజయ్‌ను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు వారి మిత్రులు తెలియజేశారు. దీనిపై ఎస్‌ఐ సుధాకర్ వివరణ కోరగా... ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.



వేదికపైకి వినాయక ప్రతిమను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

వేదికపై ఆసీనులైన గణాధిపతి

జోరుగా చవితి ఏర్పాట్లు ● నియోజకవర్గ వ్యాప్తంగా భారీ మొత్తంలో ప్రతిమల ఏర్పాటు

● పీలేరు మండలంలో 182 కేంద్రాలు ● అత్యధిక కేంద్రాల్లో ఆదివారమే నిమజ్జనం

పీలేరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సుమారు రెండు నెలలుగా రూపుదిద్దుకుని, కనువిందు చేసే రంగులద్దుకున్న గణనాధుడి ప్రతిమలు పూజా కైంకర్యాలు అందుకునేందుకు వేదికపై చేరుకున్నాయి. నియోజక వ్యాప్తంగా భారీ మొత్తంలో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క పీలేరు మండలంలోనే 182 ప్రాంతాల్లో కమిటీలు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. బుధవారం వేకువ ఝాము నుంచే ప్రతిమలకు ప్రాణప్రతిష్ఠ చేసి మూడు, ఐదు, పది రోజులు ఉత్సవాలు చేస్తుంటారు. అయితే చాలా వరకు ఐదు రోజులు (ఆదివారం) నిమజ్జనం చేయనున్నారు. కొనుగోలు కోసం పీలేరుకు వచ్చిన వారితో ఉదయం నుంచీ ప్రతిమల గోడౌన్‌లు ఉన్న చిత్తూరు, కడప, తిరుపతి మార్గం, ఏఎంసీ ప్రాంగణం కిటకిటలాడాయి. యువత కేరింతలు, బాణసంచా పేలుళ్లతో దద్దరిల్లింది. వివరాల్లోకెళితే...

వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా చేసుకునేందుకు నియోజకవర్గ ప్రజలు సమాయత్తమయ్యారు. తమ బడ్జెట్‌కు అనుగుణంగా వివిధ సైజుల ప్రతిమలను కొనుగోలు చేసి ఇప్పటికే గ్రామాలకు చేర్చుకున్నారు. సైజులను బట్టి ఒక్కో ప్రతిమ కనిష్ఠంగా రూ.12 వేల నుంచి గరిష్ఠంగా రూ.1.50 లక్షలు పలికాయి. తమకు నచ్చిన ప్రతిమలను కొనుగోలు చేసిన తరువాత తమ సెంటర్లకు తరలించే క్రమంలో యువత కేరింతలు, బాణసంచా పేలుళ్లతో దద్దరిల్లింది. పట్టణం సాయంత్రం నుంచి పూజాసామగ్రి కొనుగోలు కోసం ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలతో నిండిపోయింది. సాయంత్రం 5 గంటల నుంచి పూజాసామగ్రి, కొత్త బట్టలు, ఇతర నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ప్రజలతో ప్రధాన రహదారి ఎల్‌బీఎస్ రోడ్డు వాహనాలతో నిండిపోయింది. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం పోలీసులకు తలకు మించిన భారమైంది. సొంత ఊళ్లకు బయలుదేరిన వారితో పీలేరు బస్‌స్టాండు కిటకిట లాడుతోంది. చవితి వేడుకలను పర్యావరణ హితంగా చేసుకోవాలనే లక్ష్యంతో స్థానిక సాయిబాబా భవన నిర్మాణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఉచిత విద్యుత్‌తో వెసులుబాటు

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో వినాయక మండపాల నిర్వాహకులకు కాసింత ఆర్థిక వెసలుబాటు దక్కినట్లైంది. గతంలో ఓ మోస్తరు అలంకరణ చేసే వాళ్లు సైతం ఈ ఏడాది కాసింత ఎక్కువగా అలంకరణపై దృష్టి సారించే అవకాశం దక్కింది. నియోజకవర్గంలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ, కలకడ, కలికిరి మండలాల నుంచి విద్యుత్ అనుమతుల కోసం తమకు ఆన్‌లైన్‌లో 200 దరఖాస్తులు అందాయని, ఉచిత విద్యుత్ ప్రకటన రావడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేదన్నారు. అయితే మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో కనెక్షన్ తీసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర రెడ్డి తెలిపారు.

ఐదు రోజుల నిమజ్జనంతో పెరిగిన ఖర్చులు

వినాయక చవితి సందర్భంగా స్వామి వారిని మూడు రోజులపాటు కొలువుదీర్చి మూడో రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది మూడో రోజు శుక్రవారం రావడంతో చాలా చోట్ల ఐదు రోజులు స్వామిని కొలువుదీర్చి ఆదివారం నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది మండపాల నిర్వహణ ఖర్చు పెరిగే అవకాశం ఉంది. పీలేరు మండలంలో అందరూ సామూహికంగా ఆదివారం నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె మండలాల్లోనూ అత్యధిక సెంటర్లలో ఆదివారం నిమజ్జనం చేయనున్నారు. సగటున ఒక మండపం నిర్వహణకు మూడు రోజులు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా ఖర్చు అవుతుందని వారు తెలిపారు.

ఎక్కడెక్కడ ఎన్నెన్ని ప్రతిమలు

మండలం	కేంద్రాలు
పీలేరు	182
కలికిరి	103
కేవీపల్లె	121
కలకడ	70
గుర్రంకొండ	50

పెరిగిన పూల ధరలు, డీజేల అద్దెలు

చవితి వేడుకలు అనగానే పూలు, పత్రి అవసరం కాబట్టి మంగళవారం ఉదయం నుంచీ పూల ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. చిట్టి రోజాలు కేజీ రూ.300ల నుంచి రూ.400లు, చామంతులు, చెండు మల్లి కిలో రూ.160ల నుంచి రూ.400లు, కదిరి మల్లె పూలు కిలో రూ.500ల నుంచి రూ.వేయి చేరుకున్నాయని వ్యాపారులు తెలిపారు. అయితే పండుగ సందర్భంగా బళ్లారి డ్రమ్ములు, డీజే వాహనాలకు కూడా భారీగా అద్దెలు పెరిగాయని మండపాల నిర్వాహకులు తెలిపారు. సాధారణ రోజుల్లో బళ్లారి డ్రమ్ములకు రోజుకు రూ.12 వేల నుంచి రూ.15 వేలు అద్దె కాగా వినాయక చవితి సందర్భంగా రోజుకు రూ.30 వేలు అయ్యాయని, సాధారణంగా రోజుకు రూ.25 వేలు ఉండే డీజే వాహనం అద్దె పండుగ సందర్భంగా నిమజ్జనం రోజు కోసం రూ.లక్ష నుంచి రూ.2.5 లక్షలు అడుగుతున్నారని నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా పండ్ల ధరలు కూడా పెరిగాయి.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోండి



వినాయక మండపాలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అనవసర హంగులు, అలంకరణ కాకుండా స్వామి వారిని సాధారణంగా అలంకరించుకోవాలి. ఇనుప పోల్స్‌తో మండపాలు ఏర్పాటు చేస్తారు కాబట్టి విద్యుత్ సౌకర్యం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నాణ్యమైన పరికరాలు వాడాలి.

చంద్రశేఖర రెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ




పీలేరులో మట్టి వినాయక ప్రతిమలు కొనుగోలు చేస్తున్న జనం - పూల దుకాణాల వద్ద రద్దీ

ముస్తాబైన మండపాలు

తంబళ్లపల్లె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చవితి వేడుకలకు మండపాలు కనులవిందు చేస్తూ ముచ్చటగా ముస్తాబయ్యాయి. వేదికల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, పూలు, కలర్ పేపర్స్ తదితర వాటితో మండపాలను ముస్తాబు చేసి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాల్లో వినాయకుడిని కొలువుదీర్చేందుకు తంబళ్లపల్లె, మదనపల్లె, సీటీఎం, కంటేవారిపల్లె, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్య ప్రతిమలను కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వినాయక చవితి పండుగ రోజున సాయంత్రం తోలు బొమ్మలాట ప్రదరించనున్నట్లు తెలిపారు.




కలకడలో ప్రతిమలను వాహనాల్లో తరలిస్తున్న నిర్వాహకులు - బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణీకులు

వినాయక ప్రతిమల వితరణ



వినాయక ప్రతిమలకు పూజ చేస్తున్న చంద్రకుమార్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా అండేకురవపల్లె టీడీపీ నేత సిబ్యాల దినకర్ మంగళవారం 15 గ్రామాలకు వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ.ఐదు లక్షల విలువైన ప్రతిమలను గ్రామాల్లో ప్రతిష్ఠించిన అనంతరం నిమజ్జనం చేయాలని సూచించారు. సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, కలికిరి మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి కలికిరి పరిసర గ్రామాల ప్రజలకు పంపిణీ చేశారు. ప్రతిమలకు పూజలు నిర్వహించిన అనంతరం చంద్రకుమార్ రెడ్డి పంపిణీని ప్రారంభించారు. గ్రామాల్లో చవితి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ప్రతిమలను ఉచితంగా అందజేయడం అభినందనీయమని సీఐ అనిల్‌కుమార్, చంద్రకుమార్ రెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి చెప్పారు. సాయిబాబా ఆలయం ఆవరణలో జరిగిన పంపిణీ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చూడాలి : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రాప్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీలతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పనిచేసే వెల్ఫేర్ సెక్రటరీ తన పరిధిలోని పాఠశాలల వివరాలు, విద్యార్థుల వివరాలు, డ్రాపౌట్స్ వివరాలు సేకరించి తల్లిదండ్రులతో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి వారం నిర్వహించే సమీక్షలో వెల్ఫేర్ సెక్రటరీలు పాల్గొని విద్యా విధానంలో మార్పులు తీసుకురావడానికి సహకరించాలని కోరారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం తీరును పరిశీలించాలన్నారు. అనంతరం విద్యార్థుల వివరాలు, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మేనేజరు మనోహర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మస్తాన్‌వల్లి, వెల్ఫేర్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించాలి



మట్టి వినాయక ప్రతిమల వినియోగంపై ర్యాలీ చేస్తున్న స్కౌట్ విద్యార్థులు

నిమ్మనపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక పండుగ సందర్భంగా అందరూ మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలని జడ్పీ హైస్కూల్ స్కౌట్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయుడు రెడ్డిశేఖర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, ఇతర వస్తువులతో తయారు చేసిన ప్రతిమలను ప్రతిష్ఠిస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ముఖ్యంగా మట్టి ప్రతిమతో పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

పీలేరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కడప విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి యూరియా కోసం తీవ్ర ఒత్తిడి ఉందని, స్టాకు వచ్చిన వెంటనే రైతుల అవసరం మేరకు యూరియా అమ్మాలని తెలిపారు. వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఓ రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం 95 క్వింటాళ్ల యూరియా కోసం ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా వచ్చిన ఎప్పటికప్పుడు రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నామని చెప్పారు. విజిలెన్స్ అధికారులు పట్టణంలోని గ్రోమోర్, శ్రీనివాస, వెంకటేశ్వర, అన్నపూర్ణ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

రైతులకు సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ

పెద్దమండ్యం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పశుగ్రాస విత్తనాల పంపిణీ జరిగింది. పెద్దమండ్యం, వెలిగల్లు, కలిచెర్ల గ్రామాల్లో రైతులకు పశు వైద్యాధికారులు ఉస్మాన్, చరిత గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. 75 శాతం సబ్సిడీతో 9 టన్నుల మొక్కజొన్న, 5 వందలు కిలోల జొన్నలు పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెలిగల్లులో సర్పంచ్ బయ్యారెడ్డి, నేతలు రామాంజులు, పెద్దమండ్యంలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర, రైతు సంఘం నాయుడు మహేశ్వర, చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమండ్యం రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ

తంబళ్లపల్లె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తోందని పశు వైద్యాధికారి విక్రం రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కన్నెమడుగు పశువైద్యశాలలో కూటమి నేతలతో కలిసి రాయితీ మొక్కజొన్న విత్తనాలను పంపిణీని ప్రారంభించారు. మండలానికి మొత్తం 10 టన్నుల పశుగ్రాస మొక్కజొన్న విత్తనాలు వచ్చాయన్నారు. 75 శాతం ప్రభుత్వ రాయితీతో పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 5కిలోల బ్యాగు ధర రూ.85 అని తెలిపారు. తంబళ్లపల్లె, గోపిదిన్నె, కొటాల, గుండ్లపల్లె, కన్నెమడుగు, కోటకొండ పశువైద్య కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు భూమి పాసు పుస్తకం, ఆధార్‌కార్డుతో పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు.

హెచ్‌ఐవీ నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చు



రిమాండ్ ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న సబ్ జైలర్ లక్ష్మణరావు

మదనపల్లె టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల నుంచి తగిన జాగ్రత్తలు, చికిత్స తీసుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని సబ్ జైలర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక సబ్ జైలులో ఆర్ఆర్ఎస్ సంస్థ ఐఈసీ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధితులతో పాటు, వారి కుటుంబీకులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాల ద్వారా బాధితులకు ఉచిత చికిత్స మందులు అందజేస్తున్నారని గుర్తు చేశారు. అవసరమైన వారికి సంస్థ, వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఆర్ఆర్ఎస్ ఏఎన్ఎం శ్వేత, ఓఆర్‌డబ్ల్యూ జనార్ధన్, లెప్రా సొసైటీ కోఆర్డినేటర్ పవన్‌కుమార్, రిమాండ్ ఖైదీలు పాల్గొన్నారు.

శాంతి, సామరస్యంతో పండుగ చేసుకోవాలి

● పీస్ కమిటీ సమావేశంలో సబ్ కలెక్టర్, డీఎస్పీ



మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను శాంతి, సామరస్యంతో చేసుకోవాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. సబ్‌కలెక్టరేట్‌లో హిందూ, ముస్లింలతో కూడిన పీస్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలని తెలిపారు. మండపాల వద్ద ఎక్కువ శబ్దాలు వచ్చేలాగా లౌడ్‌స్పీకర్లు, పాటలు లేకుండా చూసుకోవాలన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ల వద్ద మండపాలు ఏర్పాటు చేయవద్దని, విద్యుత్ ప్రమాదాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో సబ్‌కలెక్టరేట్ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద ఆకతాయిల చేష్టలు, సినిమా పాటలు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. నిమజ్జనం సమయాల్లో బాణసంచా పేల్చకుండా, శాంతియుతంగా ర్యాలీలు చేసుకోవాలన్నారు. నిమజ్జనం ప్రాంతాల్లో రాత్రిపూట ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఏఓ నిర్మలాదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, మహమ్మద్ రఫీ, రాజారెడ్డి, కళా వెంకటరమణ, బీజేపీ నాయకుడు భగవాన్, బండి ఆనంద్ పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

మదనపల్లె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలు, వ్యాపారులు, రైతులు, తదితర వర్గాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాష, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాం చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కోహూరి మల్లికార్జుననాయుడు, మాజీఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన నేతలు గంగారపు రామ్‌దాస్‌చౌదరి, శ్రీరామ రామాంజనేయులు, మార్కెట్ కమిటీచైర్మన్ జంగాల శివరామ్, హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్ శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

క్విజ్‌లో సత్తా చాటిన విద్యార్థులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ఎయిడ్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో మదనపల్లె శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ ఎన్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రంలోనే మొదటి బహుమతి అందుకున్నారని చెప్పారు. విజేతలు నూలా అంజుమ్, ప్రభు కుమార్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

మట్టి ప్రతిమల పంపిణీ

ములకలచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. టీడీపీ మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి పూల సుజాతశంకర్, కుమారుడు పవన్ కళ్యాణ్ వంద మందికి ఉచితంగా ప్రతిమలు అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు శ్రీనివాసులు, రెడ్డెప్ప, వెంకటసిద్ధయ్య పాల్గొన్నారు.

దంత సమస్యపై అవగాహన సదస్సు

రామసముద్రం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కేసీపల్లె ఉన్నత పాఠశాలలో పుంగనూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దంత సంరక్షణపై అవగాహన చేపట్టారు. పుంగనూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గణేష్ అధ్యక్షతన ప్రముఖ దంత వైద్యులు శరణ్ కుమార్ పిల్లలకు అవగాహన కల్పించారు. హెచ్ఎం వేదవతి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్, విజయకుమారి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ప్రయాణీకుల రద్దీ



సీట్ల కోసం కిటికీల్లో ఎక్కుతున్న ప్రయాణీకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మదనపల్లె ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ప్రయాణీకుల రద్దీ పెరిగిపోయింది. మంగళవారం పయాణీకుల సందడి నెలకొంది. బస్ స్టాండ్ ఆవరణం జనసంద్రమైంది. ఉదయం నుంచి కూడా ప్రయాణీకులు ఇతర ప్రాంతాల నుంచి మదనపల్లె ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు చేరడంతో జనాలు అధికంగా కనిపించారు. బస్సుల్లో ప్రయాణీకులతో నిండిపోయాయి. కొన్ని ప్రాంతాలకు బస్సులు చాలక ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. చాలా సమయం బస్సు ల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ప్రయాణీకులు అధికం కావడంతో బస్సుల్లో ప్రయాణించడానికి సీట్ల కోసం కిటకీల్లో ఎక్కారు. బ్యాగులను, చేతి రుమాళ్లు, టవల్స్‌తో సీట్లను రిజర్వ్ చేసుకున్నారు. ఇతర జిల్లాలు అనంతపురం, కడప, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, విజయవాడ, ఇతర రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగ రిత్యా స్థిరపడిన వారు పండుగకు సొంతూర్లకు విచ్చేడంతో ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణీ కులు రద్దీగా మారిపోయింది. దీంతో జనాలు కిక్కిరిసిపోయారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I GHANI SHOUKAT (Old Name) S/o, MOHAMMAD GANI, D.No 27-823,Telephone Colony, CHITTOOR, Chittoor Dist., A.P.,517002, I Changed my name to GHANI SHOUKATH. Hence forth i will be known as GHANI SHOUKATH.
AJT-632

CHANGE OF NAME

I,VAKKAKULA MUNASWAMY (Old Name) S/o late VAKKAKULA MUNASWAMY REDDY R/O Door No:13-3-344/13A, Jabbar layout, Tirupati -517501, Andhra Pradesh. I changed my name to VAKKAKULA MUNASWAMY REDDY. Henceforth I will be known as VAKKAKULA MUNASWAMY REDDY.
AJT-1564

WANTED

తిరుపతిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పనిచేయుటకు Junior Accountant, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్ కావలెను. సంప్ర: 97411 63131, 96763 29827.
AJT-1563

CHANGE OF NAME

I, T. RUTH KUMARI W/o. TURUMARLA SIMON AMRUTH KUMAR R/o.6-1-8A,Old Maternity Hospital Road, Opp Rajanna Park, East Mission Compound, TIRUPATI URBAN, TIRUPATI Dist-517501, AP. I Have changed my name to P.KUMARI RUTHA W/o T.S.AMRUTH KUMAR (New Name). Henceforth i will be known as P.KUMARI RUTHA W/o T.S.AMRUTH KUMAR (New Name)
AJT-1565

CHANGE OF NAME

I, M.GURUDEVA NAIDU S/o. M.CHINNAMMA NAIDU 19-3-1/201, SLV Residency,Postal Colony,Renigunta Road, Tirupati Town &Dt., AP- 517501, I have changed my name to MALLIDI GURUDEVA NAIDU S/o M. CHINNAMA NAIDU (New Name). Henceforth i will be known as MALLIDI GURUDEVA NAIDU S/o M.CHINNAMA NAIDU (New Name)
AJT-1568

WANTED

తిరుపతి గాంధీరోడ్డులోని పారగాన్ షూ మార్ట్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్‌మెన్స్ కావలెను. సంప్రదించండి: 83413 20235.
AJT-633

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, బిల్లింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 246568

WANTED

Wanted Teachers for Physics, Hindi Subjects and Hostel Wardens, Computer Operators for a Reputed School in S.N Puram,Tirupati. Attractive Salary. Cont: 92908 98331, 70138 81383.
AJT -1553

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

వాల్మీకిపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వాలని మండల స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్రంలో పౌష్టికాహార పంపిణీ, పరిశుభ్రత, ప్రీస్కూల్ మెనూ తదితర రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఏవేని సమస్యలున్నా తక్షణం అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.


అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న



చవితి వేడుకల్లో జాగ్రత్తలు పాటించండి : డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో చవితి వేడుకలను శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తగా చేసుకోవాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సూచించారు. పట్టణంలో శ్రీ కృష్ణ కళ్యాణ మండపంలో నిర్వహించిన మం డపాల నిర్వాహకుల అవగాహన సమావేశంలో ఆయన పలురకాల సూచనలు చేశారు. డీఎస్పీ కార్యాలయంలో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, చవితి ఉత్సవాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా పీసీఆర్ 9154877503 కు తెలియజేయాలని కోరారు.

శాంతియుతంగా వేడుకలు

గుర్రంకొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణం, గ్రామాల్లో ప్రజలు వినాయక చవితి పండుగను శాంతియుతంగా చేసుకోవాలని వాల్మీకీపురం సీఐ రాఘవరెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన నిర్వాహకులు, ప్రజలతో మాట్లాడుతూ చవితి మండపాల వద్ద పోలీసు నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి వేదిక వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించి శాంతియుతంగా పండుగ చేసుకోవాలన్నారు. శాంతియుతంగా నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఎస్ఐ రఘురాం, ఏఎస్ఐ గజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు చేస్తే చర్యలు తప్పవు

వాల్మీకిపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో అల్లర్లు చేయాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని సీఐ రాఘవరెడ్డి హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ప్రారంభం నుంచీ నిమజ్జనం రోజు వరకు ఉత్సవ కమిటీలు బాధ్యత వహించాలన్నారు. మండపాల వద్ద ప్రజలకు ఇబ్బంది కలిగించేలా డీజే నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదన్నారు. నిమజ్జనం చేసే చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాలను పరిశీలించారు. ఎస్ఐలు చంద్రశేఖర్, రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల వ్యాప్తంగా 98 మండపాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రశాంత వాతా వరణంలో పండుగ చేసుకోవాలని ఎస్ఐ కోరారు.

శాంతిసమావేశం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చవితి వేడుకలు చేసుకోవాలని పీటీఎం ఎస్ఐ హరిహర ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం ఆయన మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల నిర్వా హకులతో కలిసి శాంతిసమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండ పాల వద్ద అధిక శబ్ధం కలిగించే సౌండ్ సిస్టంను పరిమితిలోనే ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రహదారులపై వాహనాలను అడ్డుగా నిలపరాదని, వినాయక నిమజ్జన సమయంలో మద్యపానం చేసి కార్యక్రమాల్లో పాల్గొనరాదని, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మండల అధికారులు ప్రజాప్రతినిధులు నిర్వాహకులు పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో వినాయక మండపాలు పరిశీలిస్తున్న సీఐ రాఘవరెడ్డి



డ్రాపౌట్స్ కాకుండా చర్యలు తీసుకోవాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా మున్సిపల్, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష సూచించారు. మంగళవారం గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్ల వరకు నిర్బంధ విద్యను అందించాల్సిన అవసరం వుందన్నారు. ఎక్కడైనా విద్యార్థి చదువు నిలిపివేస్తే వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మస్తాన్‌వలి, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం మదనపల్లె మండలంలోని సీటీఎం వాసులు జయకృష్ణకు రూ.1.78లక్షలు, శ్రీనివాసులుకు రూ.1.20లక్షల చెక్కులను సీఎంఆర్ఎఫ్ నిధుల కింద ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చల్లా నరసింహులు, బాలుస్వామి, రెడ్డిరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీలకు రూ.5లక్షల వరకు రుణాలు


సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ సోమశేఖర్

నిమ్మనపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరపతి సహకార బ్యాంకులో ఎస్సీ, ఎస్టీలకు రూ.5లక్షల వరకు రుణాలు అందిచనున్నట్లు మదనపల్లి బ్యాంకు మేనేజర్ సోమశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘంలో సీడీసీసీ బ్యాంకు ఖాతాదారులతో ఆయన మాట్లాడుతూ బ్యాంకు పూర్తిగా ఆన్‌లైన్ సేవలు అందిస్తోందని ఖాతా దారుల కోసం ఏటీఎంలను ప్రవేశపెట్టామన్నారు. ఖాతాలు వున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.5లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తామని పైగా వాటికి తక్కువ వడ్డీతో రికవరీ చేస్తామన్నారు. సూర్యఘర్ కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రుణాలను రూ.2లక్షల నుంచి రూ.15లక్షల వరకు 12శాతం వడ్డీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. బంగారు రుణాలు కావాలంటే కేవలం 2నిముషాల్లోనే మంజూరు చేస్తామని తెలిపారు. పీఎం ఇన్సూరెన్స్ పాలసీ కింద 18 నుంచి 50ఏళ్ల వయస్సు కలిగిన వారు ఏడాదికి రూ.436లను చెల్లిస్తే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. సీఈఓ హరినాథ్‌రెడ్డి, కలికిరి సీఈఓ కొండప్ప, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి ధనంజయ పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నేత మృతి

పెద్దమండ్యం, ఆగష్టు 26(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండల టీడీపీ నేత పుల్లగూర ఎరుకలప్ప (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పార్టీ ఆవిర్భావం నుంచీ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ మండలంలో టీడీపీ బలోపేతం కోసం కృషి చేసి గుర్తింపు పొందారు. అయన మృతి పట్ల కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేసిన వారిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నేతలు ఉన్నారు.

బస్సుకు తప్పిన ప్రమాదం


రోడ్డు పక్కన ఆగిన ఆర్టీసీ బస్సు

ములకలచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుకు మంగళవారం ప్రమాదం తప్పింది. మదనపల్లె ఆర్టీసీ డిపో బస్సు గూడుపల్లె నుంచి ములకలచెరువుకు వస్తుండగా పాత ములకలచెరువు బస్‌స్టాప్ వద్ద చాసెస్ విరిగి అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అదృష్ట వశాత్తు బస్సు పక్కకు ఆగిపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రుచికరమైన వంటకాలను వడ్డించాలి

కలకడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మోనూ ప్రకారం రుచికరమైన వంటకాలను వడ్డించాలని మండల ప్రత్యేకాధికారి దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎంఈఓ మునీంద్రనాయక్‌తో కలిసి కదిరాయ చెరువు ప్రాథమిక, జడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి వివరాలను సేకరించారు. బియ్యం, చిక్కీలు, కోడి గుడ్లు, బాలామృతం నిల్వలను చూసి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, రమేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):మట్టి గణపతులనే పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడి కాలుష్యాన్ని నివారిద్దామని కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే బాషా అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు గణనాధుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు.









